

'శ్రీపాద' ఆదుకునేనా?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, ఎల్ఎండీ, మిడ్ మానేరులోకి సరిపడా నీళ్లు రాలేదు. దీంతో అందరి చూపు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుపై పడింది. ఎల్లంపల్లికి ఎగువ నుంచి వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోక ముందే అక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలిస్తే వానాకాలం సాగు ముందుకు సాగుతుంది. వర్షాకాలం ప్రారంభమై 55 రోజులు గడిచాయి. అనుకున్న స్థాయిలో వర్షాలు కురువ లేదు. గోదావరి నదిపై నిర్మించిన ప్రాజెక్టుల్లోకి వరద నీరు రాలేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పరిస్థితి దయనీయంగా ఉంది.

● నీళ్లు లేక వెలవెలబోతున్న ఎల్ఎండీ, మిడ్ మానేరు

- ఎస్సారెస్పీలో అంతంత మాత్రంగానే నీళ్లు
- ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తేనే పంటలకు సాగునీరు
- 13 టీఎంసీలకు చేరుకున్న ప్రాజెక్టు నీటి మట్టం

● ప్రాజెక్టుల పరిస్థితి

పోచంపాడ్‌లో గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.167 టీఎంసీల నీరు ఉంది. 19,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి ఎస్సారెస్పీ నీటి మట్టం 55 టీఎంసీలు. అప్పటికీ, ఇప్పటికీ 30 టీఎంసీల తేడా ఉంది. సాధారణంగా ప్రాజెక్టులో 50 టీఎంసీలకు నీటి మట్టాలు దాటితేనే ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా సరస్వతీ, లక్ష్మి, కాకతీయ కాలువల ద్వారా నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లోని ఐదు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉంది. అక్కడి నుంచి కాకతీయ ప్రధాన కాలువ ద్వారా ఎల్ఎండీకి నీటిని సరఫరా చేస్తారు. ఎల్ఎండీ నుంచి కరీంనగర్, వరంగల్, హన్మకొండ, తదితర జిల్లాల్లోని 4.5 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీటిని అందించాల్సి ఉంది.

● ఎల్ఎండీలోకి నీళ్లు చాలా తక్కువ వచ్చాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.28 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 945 క్యూసె క్కుల నీళ్లు వస్తున్నాయి. కనీసం 15 టీఎంసీల నీళ్లు వస్తేనే ఆయకట్టు భూములకు సాగు నీటిని విడుదల చేయవచ్చు.

● ఎల్ఎండీకి ఎగువన ఉన్న మిడ్ మానేరు పూర్తి స్థాయి నీటి మట్టం 27.54 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.89 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవాలంటే ఎల్ఎండీకి 18.7 టీఎంసీలు, మిడ్ మానేరుకి 22 టీఎంసీలు అవసరం ఉంటుంది. రెండు ప్రాజెక్టులకు కలిపి 40 టీఎంసీల నీళ్లు అవసరం. గత ఏడాది జూలై నెలాఖరు నుంచి ఆగస్టు వరకు ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, ఎల్ఎండీ రిజర్వాయర్ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పూర్తి స్థాయి నీటి మట్టాలకు చేరుకున్నాయి. గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలి పెట్టారు. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

● ఆదుకోవాలంటున్న రైతాంగం

వర్షాల పరిస్థితి, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటిని అంచనా వేసి అదనపు నీటిని గేట్ల ద్వారా గోదావరిలోకి వదిలి పెట్టకుండా మోటార్లు ఆన్ చేసి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు తరలించాలని రైతులు కోరుతున్నారు. అవసరాన్ని బట్టి మిడ్ మానేరు నుంచి ముందుగా ఎల్ఎండీకి నీటిని విడుదల చేసి ఆ తర్వాత మల్లన్నసాగర్‌కు తరలించేందేందుకు నీటి పారుదల శాఖాధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ డి-83, డి-86 కాలువల ద్వారా జిల్లాలో 1,82,699 ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి రావాల్సి ఉన్నాయి. చాలా మంది రైతులు వరి నార్లు పోసి నీళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నాట్లు వేసే పరిస్థితి ఉన్నా, ప్రాజెక్టు నిండక నీటిని విడుదల చేయకుంటే నష్టపోతామని రైతులు అంటున్నారు. ఎస్సారెస్పీలోకి కనీసం 45 టీఎంసీల నీళ్లు వచ్చినా వర్షాధారంతో ఆయకట్టు భూముల్లో వరి నాట్లు వేసుకుంటామని రైతులు చెబుతున్నారు. మిడ్ మానేరు, ఎల్ఎండీలోకి క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి సరిపడా నీళ్లు రాకుంటే ం ఎల్లంపల్లి నుంచే వాటికి నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. వర్షాలను బట్టి ప్రభుత్వ ఆదేశాల మేరకు నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి మిడ్ మానేరుకు నీటిని తరలిస్తామని నీటి పారుదల శాఖాధికారులు అంటున్నారు.

● శ్రీపాదలోకి ఆశాజనకంగా ఇన్‌ఫ్లో

వారం రోజులుగా ఎల్లంపల్లి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి సుమారు ఏడు టీఎంసీల నీళ్లు వచ్చాయి. బుధవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులోకి 6,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 12.864 టీఎంసీలకు చేరుకున్నది. గురువారం నాటికి 13 టీఎంసీలకు చేరుకోనున్నది. కడెం, ఎల్లంపల్లి ఎగువ ప్రాంతంలో మరిన్ని భారీ వర్షాలు కురిస్తే వారం రోజుల్లోనే ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటుందని నీటి పారుదల శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.

అడుగంటిన 'కాళేశ్వరం' ఆశలు

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు జరగడంతో ఆయా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో వరద నీరంతా సముద్రంలోకి వెళుతోంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కూడా నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు. గత ఏడాది ఇదే సమయానికి ఎల్లంపల్లిలో 16.538 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. జూలై మొదటి వారంలో వర్షాలు పడక పోవడంతో కాళ్వేరం ప్రాజక్టు నుంచి ఎల్లంపల్లిలోకి 8 నుంచి 9 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అక్కడి నుంచి మిడ్ మానేరుకు తరలించారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత ఎత్తిపోతలను నిలిపి వేశారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

భగత్‌నగర్, జూలై 24: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తా వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కళ్లుండి చూడలేని వారిలా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే తమ పదవులకు రాజీనామాలు చేయాలన్నారు. తెలంగాణపై మోదీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను కూడా చూపించడం లేదన్నారు. పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలుచేయకుండా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని తుంగలో తొక్కి ఏ మాత్రం నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ ఊసే లేదన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఉపయోగం లేదన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ట్రిపుల్ ఐటీని తీసుకు రావడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం బ్రహ్మాండగా నిధులు కేటాయించామని ట్విట్టర్‌లో పేర్కొనడం సిగ్గుచేటన్నారు. నూతన రైల్వే మార్గాలకు ఏమైనా నిధులు కేటాయించారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సరేందర్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపల్లి కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, బొనగిరి మహేందర్, న్యాలపట్ల రాజు, చెంచల మురళి, సాయవేని రాజమల్లు పాల్గొన్నారు.

జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



కరీంనగర్ క్రైం, జూలై 24: జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా ముప్పిడి శ్రీనివాస్ రెడ్డి నియామితులయ్యారు. అగ్నిమాపకశాఖలో పలువురు ఫైర్ ఆఫీసర్‌లతోపాటు ఫైర్‌మెన్‌బదిలీలు జరిగాయి. ఇప్పటి వరకు జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా పనిచేసిన టి వెంకన్న హైదరాబాద్ జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లో పని చేస్తున్న డీఎఫ్‌వో ఎం శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు డీఎఫ్‌వో టి వెంకన్న నుంచి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పరమేశ్వర్ సిద్దిపేటకు బదిలీకాగా ఆయన స్థానంలో సిద్దిపేటలో పనిచేస్తున్న ఫైర్ ఆఫీసర్ ఎస్ రాజ్‌కుమార్ బదిలీపై వచ్చారు. హుజురాబాద్ స్టేషన్ ఫైర్ ఈఫీసర్ సీహెచ్ రాజయ్య హుస్నా బాద్‌కు బదిలీ అయ్యారు. కరీంనగర్ ఫైర్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఫైర్ మెన్ పి నాగరాజు, ఇ శశికుమార్ చొప్పదండికి, హుజూరాబాద్ ఫైర్ మెన్‌గా పనిచేస్తున్న జి అనిల్‌కుమార్, వి శ్రీనివాస్ కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరగలేదు

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



భగత్‌నగర్, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో తెలంగా ణకు ఎటువంటి అన్యాయం జరగలేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఓ ప్రకటనలో ఆయన ఖండించారు. భారతదేశంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం సహా తెలంగాణ భాగమని, కేంద్రం ప్రతి పథకానికి ఖర్చు చేసే నిధుల్లో కరీంనగర్ సహా తెలంగాణకు వాటా ఉంటుందనే విషయం మరిచి పోయి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ నియోజక వర్గంలోని ప్రతి పల్లె పట్టణంలో జరిగే అభివృద్ధిలో కేంద్ర నిధులున్నాయన్నారు. కరీంనగర్, వరంగల్, ఎల్కతుర్తి, సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణం, కరీంనగర్ ఆర్వోబీ, రైల్వే స్టేషన్ ఆధునీకరణ, స్మార్ట్‌సిటీ నిధులు కేంద్రానివే అన్నారు. కరీంనగర్ నుంచి జగిత్యాల రహదారి నిర్మాణం కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యంలోనిదే అన్నారు. ఈ బడ్జెట్‌లోనూ మరిన్ని నిధులు రాబోతున్నాయని తెలిపారు. రైల్వే, రహదారుల నిర్మాణంతో సహా ఇతరత్రా రంగాలకు కేటాయించిన నిధుల వివరాలను పద్దుల వారీగా జరిగే చర్చ సందర్భంగా వెల్లడిస్తారన్నారు. కాంగ్రెస్ మాదిరిగా వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీల అమలు చేస్తామని ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక గాలికొదిలేసే పార్టీ బీజేపీ కాదన్నారు. ఇకనైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అవకాశ వాద రాజకీయాలు మానుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం నిర్మాణాత్మక సలహాలివ్వాలని కోరుతున్నామన్నారు.

అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు

● శిథిలావస్థకు చేరినా పట్టించుకోని అధికారులు



చెట్లతో నిండిన ఎస్సారెస్పీ కాలువ

కరీంనగర్ రూరల్, జూలై 24: మండలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని డీ 93 కాలువ ద్వారా రైతులకు నీరు అందిస్తున్నారు. ఈ కాలువ కింద దాదాపు 6,500 ఎకరాలు పంటలు సాగవుతాయి. కాలువలో కొందరు చెత్తచెదారం తీసుకువచ్చి పోశారు. కాలువలకు ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో నీరు పారని స్థితి నెలకొంది. కొన్ని చోట్ల కాలువ మధ్యలో పైపులైన్ వేసి మట్టి పోశారు. వర్షానికి మట్టి కూలి నీరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది. నీటిని విడుదల చేస్తే ఈ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఎస్సారెస్పీ కాలువలను శుభ్రం చేసి, అవసరం ఉన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.



ఎస్సారెస్పీ కాలువ మధ్యలో వేసిన వేస్టేజీ

దెబ్బతిన్న కాలువ కట్టడాలు

బల్దియాలో బదిలీల సందడి

- నాలుగేళ్లు దాటిన ఉద్యోగులకు స్థానచలనం
- పౌరసేవలకు అంతరాయం
- 30వరకు ఇదే పరిస్థితి


కరీంనగర్ టౌన్, జూలై 24: బల్దియాల్లో బదిలీల సందడి నెలకొంది. ఎప్పుడు ఎవరు ట్రాన్స్‌ఫర్ అవుతారో, ఆయన స్థానంలో ఎవరికి పోస్టింగ్ ఇస్తారో తెలియడం లేదు. నాలుగేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి మొదలుకొని జోనల్ స్థాయి అధికారుల వరకు బదిలీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని మున్సిపల్ నుంచి జోనల్ స్థాయిలో బదిలీ ప్రక్రియ చేపడుతు న్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని హుజూరాబాద్, జమ్మి కుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపా లిటీల్లోని ఉద్యోగులకు పెద్ద సంఖ్యలో బదిలీలు అవుతున్నాయి.

● టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల్లో భారీగా బదిలీలు

నగరపాలక సంస్థలో అత్యంత కీలకమైన టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, పరిపాలన విభాగాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న చాలా మంది అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అవుతున్నాయి. వారిలో కొంత మంది ఇప్పటికే ఇక్కడి నుంచి రిలీవ్ అయి బదిలీ అయిన స్థానాలకు వెళ్ళిపోయారు. మరికొంత మంది రిలీవ్ కాక పోవడంతో కొత్తవారు కూడా జాయిన్ కావడం లేదు. వారం, పదిరోజులుగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ కొంత మందికి చొప్పున వెలువడుతుండడంతో బదిలీ అయిన వారు వెళ్లిపోతుండగా, మిగిలిన వారిలో నాలుగేళ్లు దాటిన వారు వారికి నచ్చిన పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు. మరికొంత మంది అధికారులు లేకపోవడంతో కొత్తగా జాయినింగ్ అయిన అధికారులు, ఉద్యోగులు వచ్చే వరకు వేచి చూద్దాం లే అనుకుంటుండంతో పౌరసేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈనెల 21వ తేదీతో బదిలీ ప్రక్రియ పూర్తికావలసి ఉండగా కొన్ని శాఖల్లో వివిధ కారణాల వల్ల బదిలీ ప్రక్రియ పూర్తికాక పోవడంతో ప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు పొడగించింది. దీనితో ఈనెల 30వ తేదీ వరకు ఇదే విధంగా బదిలీలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు 70 నుంచి 80 శాతం వరకు బదిలీలు పూర్తయ్యాయి.

● కీలక పోస్టులు ఖాళీ

కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లగా ఆయన స్థానంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలను అప్పగించారు. సెలవుల్లో ఉన్న ఆయనను బదిలీ చేసి ఆయన స్థానంలో ఇక్కడికి ఐఏఎస్ అధికారిని పోస్టింగ్ చేస్తారని అప్పట్లోనే ప్రచారం జరుగగా ఇప్పటి వరకు ఎవరిని కమిషనర్‌గా నియమించలేదు. దీంతో కమిషనర్‌గా అదనపు కలెక్టరే కొనసాగుతారా లేక కొత్త వారిని నియమిస్తారో వేచిచూడాల్సి ఉంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో డీసీపీ సుభాష్‌ను సరెండర్ చేయడంతో ఏర్పడ్డ ఖాళీని భర్తీ చేయకుండా ఏసీపీ భాను చందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల భానుచందర్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీహరితోపాటు ఒక టీపీఎస్, ఇద్దరు టిపిబిఎస్‌లను బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్తవారికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో టౌన్‌ప్లానింగ్ విభాగంలో అనేక ఫైళ్ళుపేరుకు పోతున్నాయి. మరో కీలకమైన ఇంజనీరింగ్ విభాగంలో ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉండగా ఒకటి రెండు రోజుల్లో వాటిని భర్తీ చేయడంతోపాటు కొంత మంది ఉద్యోగులను ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయవచ్చని చెబుతున్నారు. దీంతో ఈ విభాగంలో కూడా పనులు సక్రమంగా జరుగడం లేదు. రెవెన్యూ విభాగంలో ఇప్పటికే ఒక అధికారి తోపాటు ఆరుగురు బిల్ కలెక్టర్లను బదిలీ చేశారు. బుధవారం నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, ఒక హెల్త్ అసిస్టెంట్, ఒక ఆర్‌వో, ఒక బిల్ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నుంచి ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఏడుగురు బిల్ కలెక్టర్లు (వార్డు ఆఫీసర్లు) రిలీవ్ అయి బదిలీ అయిన చోటికి వెళ్లారు. సూపరిం టెండెంట్ పోస్టుల బదిలీ ప్రక్రియను సాంకేతిక పరమైన కారణంతో చేపట్టడం లేదని తెలిసింది. కరీంనగర్‌తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో కూడా బదిలీలతో పౌరసేవలు అటకెక్కడంతో ప్రజలు కార్యాల యాల చుట్టూ తిరుగుతున్నారు. బదిలీల ప్రక్రియ పూర్తయ్యే వరకు దాదాపు ఇదే పరిస్థితి ఉంటుందని ఉద్యోగులుచెబుతున్నారు. బదిలీ ప్రక్రియలోనైనా కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు ఇతర మున్సిపాలిటీల్లోని ఖాళీలన్నింటిని భర్తీ చేసి సిటిజన్ చార్టర్ ప్రకారం పారదర్శకంగా పౌర సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఈత చెట్లను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాల రూరల్, జూలై 24 : జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామానికి చెందిన పత్తిరెడ్డి తిరుపతిరెడ్డి అనే వ్యక్తి గత కొన్నిరోజుల క్రితం ఎస్సారెస్పీ భూమిలో నాటిన 150 ఈత చెట్లను ధ్వంసం చేశాడని ఎస్సై సధా కర్ తెలిపారు. ప్రభుత్వ భూమిలో హరితహారంలో నాటిన ఈత చెట్లను తొలగించిన తిరుపతిరెడ్డిపై జగిత్యాల రూరల్ ఎంపీడీఓ బుధవారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుపతిరెడ్డిపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

● 52.1గ్రాముల బంగారం, 55 గ్రామాలు వెండి ఆభరణాలు

● ద్విచక్ర వాహనం, మొబైల్ స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 24: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై చిరంజీవితో కలిసి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్‌లు అనే ఇద్దరు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రియదర్శిని కాలనీలో ఈనెల 12న ఇంటికి తాళం వేయగా దానిని ఇనుప రాడ్‌తో పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరవాలో దాచుకన్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే ఇద్దరు దొంగలు ఈ నెల 22న ఇబ్రహీంపట్నం శివారులో మహిళను కత్తితో బెదరించి మెడలోని తాళి ఎత్తుకెళ్లారు. బాధితు రాలు ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డీఎస్పీ ఆదేశాల మేరకు మెట్ పల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వారి నుంచి సుమారు రూ. 4 లక్షల విలువ గల 52.1గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ముస్తాబాద్, జూలై 24: మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో వరకట్నం వేధింపులతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన ఎనగంటి రేఖ (25)కు ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెకు చెందిన అంజనేయులుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అంజనేయులు తరచూ తాగివచ్చి గొడవకు దిగేవాడు. అదనంగా కట్నం తేవాలని వేధించేవాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక బుధవారం ఇంట్లో ఉరేసుకుంది. రేఖ తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 24: కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడని రెండో ఠాణా హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. కరీంనగర్ మతాశిశు ఆసుపత్రి ఆవరణలో ఈ నెల 15న స్పృహ తప్పిపడి పోగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ రెండో ఠాణా సీఐ 8712670762 లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్టు హెడ్ కానిస్టేబుల్ కె.రవీందర్ 9491481433కి సమాచారం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జగిత్యాలరూరల్, జూలై 24: జగిత్యాల రూరల్ మండ లం మోరపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇరగదిండ్ల రాజు (45) గ్రామ శివారులోని చెరువులోకి తన తమ్ముడు గణేష్‌తో కలిసి బుధవారం చేపల వేటకు వెళ్లారు. విద్యుత్ వైర్లతో చేపలుపడుతున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో రాజు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యకేతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి..

జ్యోతినగర్, జూలై 24: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి లోని మాతంగి కాలనీలో మంగళవారం రాత్రి తుంగపిండి రాజమ్మ (55)పై ఇంటి పక్కనే ఉంటున్న మేకల సమ్మయ్య గొడ్డలితో దాడి చేశాడు. రాజమ్మను కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ బుధవారం తెలిపారు.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన లారీ

శంకరపట్నం, జూలై 24: మండలం కేశవపట్నంలో ఓ లారీ అదుపు తప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది. మండలంలోని కరీంపేటకు వెళ్తున్న లారీ కేశవపట్నంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది.

బస్సులో రూ. రెండు లక్షలు లభ్యం

పోలీసులకు అప్పగించిన యువకులు



హుజూరాబాద్‌లో ఎస్ఐ హైమద్‌అలీకి నగదును అందజేస్తున్న యువకులు

హుజూరాబాద్, జూలై 24: బస్సులో లభించిన రెండు లక్షల రూపాయలను పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు ఇద్దరు యువకులు. బుధవారం పరకాల నుంచి హుజూరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి రెండు లక్షల రూపాయలు ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయాడు. అదే బస్సులో బెజ్జంకికి చెందిన విలసాగరం ప్రమోద్, రేగొండకు చెందిన మొర ఉదయ్‌కుమార్ అనే యువకులు ప్రయాణిస్తున్నారు. బస్సులో సీటుపై ఉన్న బ్యాగ్‌ను చూడగా అందులో రెండు లక్షలు రూపాయలు కనిపించాయి. వారు ఆ నగదును తీసుకెళ్లి హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ హైమద్‌అలీకి అప్పగించారు. ఎస్ఐ హైమద్ అలీ ప్రమోద్, ఉదయ్‌కుమార్‌లను అభినందించారు. విచారణ జరిపి బ్యాగ్ మరిచిపోయిన వ్యక్తికి నగదును అందజేస్తామని ఎస్ఐ తెలిపారు.

శాతవాహన పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేష్‌నగర్, జూలై 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ బుధవారం విడుదల చేశారు. బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు ఒకటి నుంచి 8వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షలు..

శాతవాహన యూనవర్సిటీ పరిధిలో నిర్వహించనున్న ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్ లా పరీక్షల షెడ్యూల్‌ను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్లు (సప్లిమెంటరీ) పరీక్షలు ఆగస్టు 1 నుంచి 9వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

శిథిలావస్థలో.. వేద పాఠశాల భవనం

- విద్యనభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులు
- వసతులు కల్పిస్తే పెరగనున్న సంఖ్య
- నూతన వేద పాఠశాల భవనం నిర్మించాలని డిమాండ్



పురాతన భవనంలో కొనసాగుతున్న రాజరాజేశ్వర వేద పాఠశాల



ర్యాక్‌లపైన విద్యార్థుల దుస్తులు

వేములవాడ కల్చరల్, జూలై 24: వేములవాడలోని వేద పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో జూన్ 2018 లో వేద, ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో రాజ రాజేశ్వర వేద పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు పండితులు వేద విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారు. చిన్నారులు హిందూ ధర్మ పరిరక్షణకు నిమగ్నమై ఉచ్చరించే మంత్రాలు చుట్టుపక్కల నిత్యం ప్రతిధ్వనిస్తున్నాయి. వేదానికి ఊపిరినిచ్చే పాఠ శాల శిథిలావస్థకు చేరుకుంటోందని, నూతన భవనం నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు వేద పాఠశాలలో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఋగ్వేదం 9, యజుర్వేదం 8, సామవేదం 7, అధర్వణ వేదం 5, స్మార్తం 1 హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉండగా మరో స్మార్తం, వేదం చదివే ఐదుగురు విద్యార్థులు ఇంటి నుంచి వస్తున్నారు. బీహార్ నుంచి ఒక విద్యార్థి, మధ్యప్రదేశ్ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ము గ్గురు విద్యార్థులు వేములవాడ వేద పాఠశాలలో వేదా లను చదువుతున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

పురాతన భవనంలో వేదపాఠాలు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయం జీ ప్లస్ వన్ అంతస్థుల పురాతన భవనంలో కొనసాగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లో ఒకే చోట విద్యార్థులకు విద్యాబోధన చేపడుతున్నారు. మొదటి అంతస్థులో విద్యార్థులకు కిచెన్ సామగ్రి ఏర్పాటుకు, భోజనశాల, విద్యార్థులు దుస్తులు భద్రపరుచుకునేందుకు వాడుతున్నారు. విద్యాబోధన చేస్తున్న గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లోనే విద్యార్థులు రాత్రి వేళల్లో నిద్రిస్తున్నారు. విద్యార్థులు మంత్రాలను కంఠస్తం చేయాల్సి ఉన్నందున విడివిడి గదులు ఉండాల్సి ఉండేది. గదులు లేకపోగా ఒక హాల్ లోనే విద్యార్థులు విద్యాబోధన చేయడంతో ఇబ్బందికరంగా మారుతోంది.

వేద పాఠశాల నిర్మాణానికి ప్రణాళిక

ఆంజనేయశర్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వేదపాఠశాల, వేములవాడ.




వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టులో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు వేదాలకు నలుగురు వేద పండితులు అందుబాటులో ఉన్నారు. వేద పాఠశాలను అత్యధునాతన టెక్నాలజీతో విశాలమైన స్థలంలో నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగంగా వేద పాఠశాలను నిర్మించాలని గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.



చదువుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు అందుబాటులో నాలుగు వేదాలు..

రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో నలు గురు వేద పండితులు నాలుగు వేదాలను అందిస్తున్నారు. ఋగ్వేదం శాఖల శాఖ 10 సంవత్సరాలు, యజుర్వేదం కృష్ణ యజుర్వేదం 11, 12 సంవ త్సరాలు, సామవేదం కౌథురశాఖ 10 సంవత్సరాలు, అధ ర్వణవేదం శౌనఖ శాఖ 5,6 సంవత్సరాల పాటు చెప్పపడుతుందని అధికారులు తెలిపారు. స్మార్తం 4 సంత్సరాలు ఉంటుందని, వేదం, ఆగ మం, సంస్కృతం విద్యార్థు లకు బోధిస్తున్నట్లు తెలిపారు. వేద గణితం, కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిత్యం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.




వేదపాఠశాలలో విద్యార్థులు

ఆర్మేనియా, రష్యాలో ఉద్యోగాల పేరిట మోసం

● గల్ఫ్ ఏజెంట్ అరెస్టు ● వివరాలు వెల్లడించిన రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై 24: ఆర్మేనియా, రష్యాలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిన రుద్రంగి మండలం మానాల అడ్డబోర్ తండాకు చెందిన అజ్మీరా కిషన్ అనే గల్ఫ్ ఏజెంట్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.



బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గల్ఫ్ ఏజెంట్ కిషన్ తన ఇద్దరితో కలిసి ఆర్మేనియా, రష్యాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, లక్షల్లో జీతాలు వస్తాయని అమాయక యువకులను నమ్మిస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారు. మానాల గ్రామానికి చెందిన కోల కృష్ణం రాజు వద్ద ఉపాధి నిమిత్తం ఆర్మేనియా నుంచి రష్యా పంపిస్తానని నెలకు లక్ష జీతం వస్తుందని చెప్పి రూ. 4.50 లక్షలు వసూలు చేశాడు. ఇదే విధంగా పెగ్గర్లకు చెందిన రంజిత్ వద్ద రూ.7.50 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గరిపెల్లి శశిధర్ వద్ద రూ.6.50 లక్షలు, అంబారి పేట నరేష్ వద్ద రూ. 4.70 లక్షలు, ఆత్మకూరుకు చెందిన పుప్పాల సందీప్ వద్ద రూ. 7.50 లక్షలు, మగ్గిమాడుకు చెందిన అమరకొండ అనిల్ వద్ద రూ. 4.30 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గుం టుక రాజేశ్ వద్ద రూ.2.50 లక్షలు తీసు కొని విజిట్ వీసాలు ఇచ్చి ఆర్మేనియా పంపాడు. అక్కడ 3 నెలలు ఉంచి ఎలాంటి పని చూపించకుండా వసతులు కల్పించకుండా మోసం చేశాడు.

బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టగా అజ్మీరా కిషన్, నేపూరి తిరుపతి, కాల్వ ఉమా మహేశ్ మోసాలకు పాల్పడినట్లు తేలిందని, ఇందులో అజ్మీర కిషన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఈ ముగ్గురు కలిసి 60మంది యువకులను గల్ఫ్ పంపిస్తామని మోసం చేశారని, ఎవరైనా బాధితులు ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే వారు నకిలీ ఏజెంట్లను నమ్మి మోస పోవద్దని అన్నారు. ఇమిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారి నుంచి వీసాలు పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న ఏజెంట్లు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గల్ఫ్ ఏజెంట్ల వివరాలు అవసరమైన యువకులు స్పెషల్ బ్రాంచ్ 8712656411కు ఫోన్ చేసి తెలుసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం.. ఒకరి రిమాండ్

ఇల్లంతకుంట, జూలై 24: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన చిక్కుడువానిపల్లె గ్రామానికి చెందిన కంకటి రవిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. వల్లంపట్లకు చెందిన కీసరి నాగ రాజు డిగ్రీ పూర్తిచేసి కిరాణం దుకాణం నడుపుకుంటున్నాడు. నాగరాజును కలిసిన రవి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రూ.4 లక్షలు ఇచ్చాడు. ఉద్యోగం ఎప్పుడు ఇప్పిస్తావని తరచూ ప్రశ్నించడంతో నకిలీ అపాయింట్ మెంట్ లెటర్ ఇచ్చాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బిర్యాని సెంటర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



శాంపిల్స్ సేకరిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత

జమ్మికుంట రూరల్, జూలై 24: పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల బిర్యాని సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత బుధవారం తనిఖీ చేశారు. హోటల్ లోని బిర్యాని, చికెన్, మసాలలు, నూనె, అల్లం వెల్లుల్లీ పేస్టు, ఇతర సామగ్రిని ఆమె పరిశీలించారు. ఫ్రిజ్‌లో నిల్వ పెట్టిన చికెన్, ఇతర ఆహార వస్తువులు వినియోగదారులకు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. పలు శాంపిల్స్‌ను సేకరించి వెంట తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత మాట్లాడుతూ బిర్యాని సెంటర్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని పలువురు హైదరాబాద్‌లోని ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను తనిఖీలు నిర్వహించామని తెలిపారు. బిర్యాని, బియ్యం శాంపిల్స్‌ను సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తలనీలాల టెండర్లు వాయిదా



మల్యాల, జూలై 24: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో భక్తులు సమర్పించే తలనీలాలకు అధికారులు బుధవారం టెండర్లు నిర్వహిం చారు. ఏడాది కాలపరిమితికి సీల్‌టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా ముగ్గురు సీల్, 11మంది బహిరంగ వేలంలో పాల్గొన్నారు. అయితే అనివార్య కారణాలతో తలనీలాలు పోగు చేసే హక్కు టెండర్ వాయిదా వేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. మరోసారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. అలాగే దేవస్థానం తరుపున పోగు చేసిన తలనీలాలకు కూడా అధికారులు సీల్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. సీల్ టెండర్‌లో నలుగురు, బహిరంగవేలంలో 23 మంది డిపాజిట్ చేయగా 14 మంది వేలంలో పాల్గొన్నారు. ఇందులో కిలోకి రూ.8,500 శ్వేత రైస్ ఇండస్ట్రీస్ హెచ్చు పాటగా నిలిచింది. హెచ్చు వేలంను కమిషనర్‌కు నివేదిస్తామని తరువాత కమిషనర్ ఆదేశాలు అమలు చేస్తామని అధికారులు తెలిపారు. వేలంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు అనిల్‌కుమార్, సునీల్ దేవస్థానం సిబ్బంది ఉమామహేశ్వర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో స్వామి వారికి పూజలు

ధర్మపురి, జూలై 24: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, స్థానిక వేదపండితులు మదు రామశర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

కోరుట్ల, జూలై 24: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో ఉన్న బీఎస్‌సీ అగ్రికల్చర్ గురుకుల కళాశాలలో మౌలిక వసుతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ కార్యదర్శి ఐఏఎస్ అలుగు శ్యామలకు కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో సరైన ప్రొఫెసర్లు, కోర్సులకు సంబధించిన పరికరాలు లేవని తెలిపారు. పంటకు సంబధించిన స్థలం లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదన్నారు. తాగునీరు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అగ్రికల్చర్ హెడ్ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద

ధర్మపురి, జూలై 24: ధర్మపురి వద్ద గోదావరి నది వరద బుధవారం కొనసాగుతోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నదిలోకి నీరు చేరుతోంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం 5 గంటల వరకు కడెం ప్రాజెక్టులోనికి 6,451 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 2, 18వ నెంబర్ గేట్లు తెరచి 13,428 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. మూడు రోజుల నుంచి గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల మంగళిగడ్డ, సోమవిహార్, సంతోషీమాత ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులు, గొర్రెల కాపరులను నది వైపు వెళ్లరాదని మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ సిబ్బంది చర్యలు చేపట్టారు. వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రాయపట్నం వంతెన వద్ద కూడ ప్రజలను అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద గోదావరి ప్రవాహం

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 21,210 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 21,210క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 24.515 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 55.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 548 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 19.059 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.203 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, జూలై 24: గంజాయి మొక్కలు పెంచి యువకులకు విక్రయిస్తున్న ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటకు చెందిన జక్కనపల్లి వివేక్, ఇల్లంతకుంటకు చెందిన అంతటి వేణు, తంగళ్లపల్లికి చెందిన క్రాంతిని బుధవారం అరెస్ట్‌చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలంలోని మైలారం గ్రామానికి చెందిన వివేక్ ముస్కానిపేటలో నివాసం ఉంటూ గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడు. తంగళ్లపల్లికి చెందిన క్రాంతి వద్ద గంజాయిని కొనగోలు చేస్తున్నాడు. ఈ మేరకు తంగళ్లపల్లిలోని అంబగుడి వద్దకు వస్తున్నారనే సమాచారంతో ముగ్గురు యువకులను పట్టుకొని విచారించారు. దీంతో గంజాయి విక్రయాలు వెలుగు చూశాయి. క్రాంతి తన ఇంట్లోనే గంజాయిని అక్రమంగా సాగుచేస్తూ విక్రయిస్తున్నాడు. వారి వద్ద గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న సీఐ మొగిలి

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

సంగెం విద్యార్థి మృతి..



హర్షవర్ధన్ (ఫైల్)

కోరుట్ల రూరల్, జూలై 24 : హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందడంతో కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన పోతుకూరి రవీందర్ రెడ్డి - స్వప్న దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నాడు. కూతురు బీటెక్ పూర్తి చేయగా కుమరుడు హర్షవర్ధన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ ప్రాంతంలో అనురాగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి తన స్నేహితునితో ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి కళాశాలకు వస్తుండగా ఘట్‌కేసర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హర్షవర్ధన్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహం అప్పగించారు. హర్షవర్ధన్ మృతదేహం బుధవారం రాత్రి సంగెం గ్రామానికి చేరుకోవడంతో బంధువులు, గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి. గురువారం హర్షవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 24: మండలంలోని తాడికల్ గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన దుద్దుల రాజయ్య మోటర్ సైకిల్‌పై మానకొండూర్ వైపు వెళ్తున్నాడు. వరంగల్ వైపు వెళ్తున్న కారు తాడికల్ గ్రామ శివారులో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న రాజయ్యను ఢీ కొట్టింది. దీంతో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేశవపట్నం పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

న్యాయవాదుల సహకార గృహ నిర్మాణసంఘం అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి


లక్ష్మారెడ్డి పరమేశ్వర్

కరీంనగర్ లీగల్, జూలై 24: కరీంనగర్ జిల్లా న్యాయ వాదుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది సింగిరెడ్డి లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా తిరుమలదేవి, ప్రధాన కార్యదర్శిగా నగునూరి పరమేశ్వర్, కోశాధికారిగా ధనుక రాజశేఖర్‌రావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో 341 మంది న్యాయవాదులు సభ్యత్వం కలిగి ఉండగా 241 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. డైరెక్టర్లుగా నగునూరి పరమేశ్వర్, సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, పీవీ రాజ్‌కుమార్, హర్కాల చక్రధర్, దాసరి రాంరెడ్డి, పూరెళ్ల రాములు, ఎస్సీ, ఎస్టీ విభాగాల్లో ధనుక రాజశేఖర్‌రావు, మహిళా విభాగంలో పొత్తూరి భాగ్యలక్ష్మి, మూల తిరుమలదేవి ఎన్నికయ్యారు. కార్యవర్గానికి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునందన్‌రావు, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షడు న్యాయవాది ఉప్పుల అంజనీప్రసాద్, ఏజీపీలు కె.లక్ష్మయ్య, కూర శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాచకొండ ప్రభాకర్, బల్మూరి మహేందర్ రావు, కుమారస్వామి అభినందనలు తెలిపారు.

'బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి'

కరీంనగర్ అర్బన్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఏ ఒక్క ప్రాజెక్టుకు కేటాయింపులు జరపకపోవడం దారుణమని పేర్కొన్నారు. తెలంగాణకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు జరపనందుకు బాధ్యత వహిస్తూ తెలంగాణ బీజేపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేయాలని రాజేందర్‌రావు డిమాండ్ చేశారు.

'సామాన్య ప్రజలకు నిరాశ'

భగత్‌నగర్, జూలై 24: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు నిరాశజనకంగా ఉందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్ అన్నారు. యువత, విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ అని, కార్పోరేట్ సంస్థ లకు మాత్రమే ఉపయోగపడేలా బడ్జెట్‌ను రూపొందించారన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదినం


తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్/గణేశ్‌నగర్, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు జన్మదినం సందర్భంగా బుధవారం ఆ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు మేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, మాజీ ఎమ్మెల్యే నారదాసు లక్ష్మన్‌రావు, మాజీ మేయర్, సర్దార్ రవీందర్‌సింగ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు.

●తొమ్మిదవ డివిజన్ కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్ కోతిరాంపూర్‌లో ఏర్పాటు చేసిన బర్త్‌డే కేక్‌ను మేయర్ సునీల్‌రావు కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చల్ల స్వరూపరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ మార్కెట్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రత్యేక పూజలు నిర్వహించి వృద్ధులకు బ్లాంకెట్లు, అల్పాహారం పంపిణీ చేశారు.

●హుజూరాబాద్/శంకరపట్నం/చిగురుమామిడి/మానకొండూర్/గన్నేరువరం/రామడుగు/గంగాధర/వీణవంక/తిమ్మాపూర్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. శంకరపట్నం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మానకొండూర్‌లో మాజీ జడ్పీటీసీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. గన్నేరువరంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న కేటీఆర్ జన్మదినం నిర్వహించారు. రామడుగులో మాజీ ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ మొక్కలు నాటారు. గంగాధరలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వీణవంక మండలంలోని చల్లూరులో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు.

'నాగార్జున డెయిరీపై నిరాధార ఆరోపణలు'


విలేకరులతో మాట్లాడుతున్న నాగార్జున డెయిరీ ఏజీఎం సుధాకర్

హుజూరాబాద్, జూలై 24: కొందరు తమ సంస్థపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తమకు ఆదాయం ముఖ్యం కాదని... ప్రజల ఆరోగ్యం ముఖ్యమని నాగార్జున డెయిరీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆకునూరి సుధాకర్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కక్ష సాధింపులో భాగంగానే సంపత్ సోషల్ మీడియాలో డెయిరీపై తప్పుడు ప్రచారంతోపాటు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. నాలుగు రోజుల క్రితం సంపత్‌పై సీపీకి ఫిర్యాదు చేశామన్నారు. నాగార్జున డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రావు ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. సమావేశంలో డెయిరీ సిబ్బంది రజినీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సంతోష్, శివకుమార్, భిక్షపతి, తిరుపతి, రాహుల్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'సంపత్‌పై కుట్రలు చేయడం సరికాదు'

హుజూరాబాద్, జూలై 24: కాంగ్రెస్ నాయకుడు తిప్పారపు సంపత్‌పై నాగార్జున డెయిరీ యాజమాన్యం సోషల్ మీడియాలో చేస్తున్న ఆరోపణల్లో ఆధారాలు ఉంటే కేసులు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి భూమయ్య అన్నారు. బుధవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగార్జున డెయిరీ పాల ఉత్పత్తిలో కొన్ని అనుమానాలు ఉన్నాయని సంపత్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సంపత్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సంపత్ డెయిరీ యాజమాన్యాన్ని డబ్బులు అడగలేదన్నారు. సమావేశంలో రామచంద్రం, వసంత్, రవి, మల్లయ్య పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి'లో విద్యార్థులకు సాంకేతిక శిక్షణ

తిమ్మాపూర్, జూలై 24: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, కంప్యూటర్ విజన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సాప్ బీటీపీ, ఏబీఏపీ వంటి అంశాలపై విద్యార్థులకు తమ కళాశాలలో సాంకేతిక శిక్షణ అందిస్తామని జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిష్మతి కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్యునెట్ ఫౌండేషన్ సీనియర్ టెక్నికల్ మేనేజర్ చాందిక మోహన్, మాస్టర్ ట్రైనర్ సుమిత్ సునీల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్, సెక్రెటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ వైశాలి, విభాగాధిపతి జగదీశన్ పాల్గొన్నారు.

'బీజేపీ నేతలను నిలదీయాలి'

జమ్మికుంట రూరల్, జూలై 24: జిల్లాకు నిధులు తేలేని బీజేపీ నేతలను ప్రజలు నిలదీయాలని సీపీఎం జిల్లా కార్య దర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. జమ్మికుంట పట్టణం లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జిల్లా నుంచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గా బండి సంజయ్ కుమార్ ఉండి కూడా నిధులు తేవడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు శీలం ఆశోక్, నాయకులు కొప్పుల శంకర్, జక్కుల రమేష్, బాసిర సంపత్‌రావు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, జూలై 24: చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేష్ పటేల్ అన్నారు. ఆగస్టులో తలపెట్టిన చలో ఢిల్లీని విజయవంతం చేయాలని బుధవారం తెలంగాణ చౌక వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి తరలి రావాలన్నారు. జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. జనాభా గణనలో బీసీ కుల గణన చేయాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. గవర్నమెంట్ సంస్థలో ప్రైవేటీకరణ నిషేధించాలన్నారు. బీసీ క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింపజేయాలన్నారు. బడ్జెట్‌లో బీసీలకు 20 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలంటే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే ప్రభు త్వాలు చూస్తు న్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ అని చెప్పి జాప్యం చేస్తోందన్నారు. బీసీ బిల్లుకు మద్దతు తెలపకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలను గద్దె దింపుతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం కరీం నగర్ జిల్లా అధ్యక్షుడు అనిల్ యాదవ్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌రాజ్, కరీంనగర్ జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నంబ, రవీందర్ చారి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు సతీష్ కుమార్, ప్రణీత్, తిరుపతి, నగేష్, శివ, నరేష్, సమీర్, రవీందర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేషన్‌పై అవగాహన సదస్సు

గణేష్‌నగర్, జూలై 24: కరీంనగర్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో ఇంటింటా ఇన్నోవేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ మణి దీప్ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు సమాజానికి, వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీశైలం, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఇంటింటా ఇన్నోవేషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ మణిదీప్ హాజరై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకోవాలని ససూచించారు. ఇంటింటా ఇన్నోవేషన్ 2024 కోసం దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించారు. దరఖాస్తు ప్రక్రియ చాలా సులభంగా ఉంటుందన్నారు. మీ వ్యక్తిగత వివరాలు, గ్రామం, వయస్సు, వృత్తి మొదలగువాటిని, మీ ఆవిష్కరణలపై రెండు నిమిషాల వీడియోను దానిపై వంద పదాల వివరాలను 9100678543గల నంబర్‌కు వాట్సప్ చేయాలని, దరఖాస్తు ప్రక్రియ ఆగష్టు 3న ముగుస్తుందని వెంటనేదరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిరుపతి రావు పాల్గొన్నారు.

'వాటర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలి'

సుభాష్‌నగర్, జూలై 24: మినరల్ వాటర్ ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలని పద్మనగర్ మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు కోరారు. ఈమేరకు బుధవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పద్మనగర్, రాంనగర్ ప్రజల సౌకర్యార్థం గ్రామ పంచాయతీ భవనంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి కేవలం 2 రూపాయలకు 20 లీటర్ల నీళ్ళను అందించామన్నారు. కరీంనగర్ మున్సిపాలిటీలో విలీనం అయిన తరువాత నెలకు రూ.100లు వసూలు చేశారని తెలిపారు. 2023 జనవరి వరకు ప్లాంట్‌ను నిర్వహించారని తెలిపారు. అనంతరం వివిధ కారణాలు చెబుతూ వాటర్‌ప్లాంట్‌ను అక్కడి నుంచి తొలగించారని, దాంతో స్థానిక ప్రజలు మంచినీళ్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ మోహన్ పాల్గొన్నారు.

సహకార సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, జూలై24: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంఘ అధ్యక్షుడు తోట తిరుపతి ఆధ్వర్యంలో కేడీసీసీ బ్యాంక్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎన్.సత్యనారాయణ బుధవారం కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా ల్యాండ్ డిజిటల్ పాస్ బుక్, 1బీ, పహానీ, ఈసీ, పాన్ కార్డు, వోటర్ ఐడి కార్డులు, ఇన్సూరెన్స్‌లు, ట్రావెలింగ్ టికెట్స్, పాస్‌పోర్టు దరఖాస్తులు ఇతర సేవలను వినియోగించుకోవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు, సంఘ కార్యదర్శి వేణుమాదవ్, కేడీసీసీ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చివరి దశకు చేరుకుంది'


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్

సుభాష్‌నగర్, జూలై 24: ఎస్సీ వర్గీకరణ చివరి దశకు చేరుకుందని ఎంఎస్‌పీ నాయకులు ఇంజం వెంకటస్వామి, బోయిని కొమురయ్య అన్నారు. బుధవారం నగరంలోని కృషిభవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీతో పాటు అనుబంధ సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రామ గ్రామాన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ జెండా గద్దెలను నిర్మించి జెండాలను ఆవిష్కరించాలన్నారు. రానున్న ఆగస్టు నెలలో సుప్రీంకోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో దండు అంజయ్య, కనకం అంజిబాబు, కొత్తూరి రాజన్న, అంబల మధునయ్య, చెంచాల నవీన్, దండు రమేశ్, అంతడుపుల సంపత్, కాథ మల్లయ్య ఎల్లపెల్లి పౌలు, కోడూరి మహేశ్ పాల్గొన్నారు.

'యాదవులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'

సుభాష్‌నగర్, జూలై 24: రాష్ట్ర జనాభాలో 20శాతం ఉన్న యాదవులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవులకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలోకి తీసుకోవాలన్నారు. యాదవుల అభివృద్ధి కోసం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్లను నియమించడంతో పాటు రూ.5వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గొర్ల మేకల సొసైటీ ఎలక్షన్ నిర్వహించి చైర్మన్ డైరెక్టర్లను నియ మించాలని డిమాండ్ చేశారు. రెండో విడత గొర్ల పంపిణీ వెంటనే చేపట్టి గొర్ల కాపరుల ఖాతాలో నగదు జమ చేయాలని కోరారు. స్థానిక సంస్థల పదవులను జనాభా ప్రాతిపదికన ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్య, మర్రి ఓదెలు, ఆట్ల కొండయ్య, గుండవేని ప్రవీణ్, కత్తెర రాజు, అలుపుల కమలాకర్, పాశం తిరుపతి, వేల్పుల కొమురయ్య, ముక్కెర కొము రయ్య, గడ్డి పరశురాం తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి

భగత్‌నగర్, జూలై 24: డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి అన్నారు. బుధవారం ఆర్టీసీ కరీంనగర్-1, 2 డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 75 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాలతో జరుగుతాయన్నారు. డ్రైవింగ్ చేసే రూటుపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఇతర వాహనాలను గమనించుకుంటూ సురక్షితంగా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి అన్నారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ సుచరిత మాట్లాడుతూ ఆర్టీసీలో అతి ముఖ్యమైన, అతి కష్టమైన ఉద్యోగం డ్రైవర్ ఉద్యోగమన్నారు. డ్రైవర్ అంటే రథసారథి అన్నారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. డ్రైవింగ్ చేసేటపుడు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లయ్య, సూపర్‌వైజర్లు వీరస్వామి, వజీర్, విజయలక్ష్మి, కమల, ప్రసాద్, బాలయ్య, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీవి స్వార్థ రాజకీయాలు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

చిగురుమామిడి, జూలై 24: కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయాలు చేస్తు పబ్బం గడుపుకుంటోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. చిగురుమామిడిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు మొండి చేయి చూపించిందని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం సమంజసం కాదన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కేంద్రం ఏమిచ్చిందని మాట్లాడిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదే ధోరణి అవలంబిస్తోందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడం చేతకాని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణకు మేలు జరిగే విధంగా కేంద్రం బడ్జెట్ కేటాయింపులు చేసిందని తెలిపారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పి శ్రీనివాస్, చెప్యాల మురళీమనోహర్, రవీందర్, చంద్రయ్య సతీష్, పోచయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం సుస్థిర పాలన అందిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుర్రాల వెంకటరెడ్డి, రంగు బాస్కరాచారి, సొల్లు అజయ్‌వర్మ, రాపాక ప్రవీణ్, బలరాం, రవి, కొమురయ్య కోటేశ్వర్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

శంకరపట్నం, జూలై 24: మండల ఎంపీడీవోగా కృష్ణప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీవాణిని వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వరంగల్ జిల్లా మంగపేట ఎంపీడీవోగా పనిచేస్తున్న కృష్ణప్రసాద్ శంకరపట్నం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన ఎంపీడీవో కృష్ణప్రసాద్‌ను ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

గన్నేరువరం ఎంపీవోగా..

గన్నేరువరం: మండల పంచాయతీ అధికారిగా డి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపివో నర్సింహారెడ్డి కొత్తపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

'రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

హుజూరాబాద్, జూలై 24: డివిజన్‌లోని రైతులు రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏడీఏ సునీత సూచించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూన్ 28, 2024 వరకు కొత్తగా ధరణి పోర్టల్‌లో పట్టాదారు పుస్తకం పొంది, 18 నుంచి 59 సంవత్సరాలలోపు ఉన్న వారు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించాలని సూచించారు. గతంలో నమోదు చేయించుకున్న వారు ఆధార్‌కార్డులో ఏమైనా మార్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. 29 వరకు గడువుందని తెలిపారు.

● గంగాధర: కొత్తగా పట్టదారు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో రాజు తెలిపారు. 14 ఆగస్టు, 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన వారు అర్హులన్నారు.

'వాగేశ్వరి'లో విద్యార్థులకు ఓరియంటేషన్

తిమ్మాపూర్, జూలై 24: మండల కేంద్రంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వొడితెల రాజేశ్వర్‌రావుకు ఘన నివాళి


రాజేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వొడితెల ప్రణవ్, కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్, జూలై 24: పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితెల రాజేశ్వర్‌రావు వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు రాజేశ్వర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణవ్ జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ అందించారు. సింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని సంజీవనికి ఎంబీబీఎస్ సీటు రాగా, ఆమె చదువుకు అవసరమయ్యే డబ్బులను అందజేశారు.

● హుజూరాబాద్‌రూరల్: వొడితల రాజేశ్వర్‌రావు వర్ధంతిని మండలంలోని శాలపల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల విజయ్‌కుమార్, అరుకుల విష్ణు, జడల అశోక్, కంది నరసింహరెడ్డి, జడల సుధాకర్, దున సతీష్, కంది ప్రభాకర్‌రెడ్డి, జడల పోచయ్య పాల్గొన్నారు.

-మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్‌లో రాజేశ్వర్‌రావు చిత్రపటానికి కళాశాల డైరెక్టర్ రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాధ్యతల స్వీకరణ

భగత్‌నగర్, జూలై 24: ఆర్టీసీ కరీంనగర్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా జి.సురేష్, కరీంనగర్-1 డిపో మేనేజర్‌గా బి.విజయ మాధురిలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్టీసీ కరీంనగర్ జోనల్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరితలను మర్యాదపూర్వకంగా కలిశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

కరీంనగర్ క్రైం, జూలై 24: ఇటీవల అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ వేముల సంతోష్‌కుమార్ కుటుంబానికి అతని సహోద్యోగులు ఆర్థిక సహాయాన్ని అందించారు. 1996 కళ్యాణ్ డ్యాం తిరుపతి ట్రైనింగ్ సెంటర్ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు 55 వేల రూపాయల నగదును సంతోష్‌కుమార్ సతీమణికి అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శంకర్, వేణు, శ్రీనివాస్, శేఖర్, ప్రభాకర్, రంగారావు, అన్వర్, మోహన్‌లాల్, శ్రీను, శేఖర్, పరశురామ్, రామస్వామి, మల్లయ్య ఒస్కుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఫల్యాలపై ఉద్యమిస్తాం

గణేష్‌నగర్, జూలై 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వైఫ ల్యాలపై ఉద్యమాలు నిర్వహిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పాల రాహుల్, నంద గణేష్‌లు అన్నారు. బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వాగేశ్వరి డిగ్రీ ఉమెన్స్ కళాశాలలో నిర్వహించారు.

● కరీంనగర్ యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా రాహుల్, జిల్లా కార్యదర్శిగా నంద గణేష్, ఉపాధ్యక్షులుగా ఉరడి కుమార్, బనక తిరుపతి, కక్కర్ల సాయి, బొడ్డు మల్లికార్జున్, అఖిల్, విష్ణువర్ధన్‌లతో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

'ఎస్‌యూలో సమస్యలు పరిష్కరించాలి'

గణేష్‌నగర్, జూలై 24: శాతవాహన యూనివర్సిటీలో సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మల్యాల రాకేష్ అన్నారు. బుధవారం శాతవాహన యూనవర్సిటీ వద్ద సమస్యలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్‌వర్కింగ్ కమిటీ మెంబర్ అంజన్న, కార్యకర్తలు ఉదయ్, వీరబాబు, శివ, వరుణ్, సంజయ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు అల్పాహార వితరణ

కరీంనగర్ టౌన్/కరీంనగర్ రూరల్, జూలై24: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో కోల అన్నారెడ్డి, లావణ్య కుమారుడు కోల ఆదిత్య 2వ వర్ధంతి సందర్భంగా ఇటుక బట్టీల వద్ద వలస కూలీలకు అల్పాహార వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, జోన్ చైర్మన్ చింతల కిషన్‌పటేల్, బొమ్మకల్ ప్రెసిడెంట్ కామిరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

సుభాష్‌నగర్, జూలై 24: కోల అన్నారెడ్డి లావణ్య దంపతుల కుమారుడు కోల ఆదిత్య వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం అన్నదానం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జి ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, జోన్ చైర్మెన్ చింతల కిషన్‌పటేల్, మ్యాడం శివకాంత్, బట్టు వినోద్‌కుమార్, కొజ్జర్ల నవీన్‌కుమార్, రంగు రాజు తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవులకు నిరాశ

కరీంనగర్ టౌన్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వేతన జీవులకు కోతలు విధించిందే తప్ప మదుపు చేసుకునే అవకాశమివ్వలేదని, పొదుపు చేసుకునే అవకాశమివ్వాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.ఖాద్రీ ఒక ప్రకటనలో కోరారు.

సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్ కల్చరల్, జూలై 24: నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ప్రైవేటు అధ్యాపకులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి

సుభాష్‌నగర్, జూలై 24: ప్రైవేటు విద్యారంగంలో ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు మాసం రత్నాకర్ కోరారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సలహా కమిటీ వైస్ చైర్మెన్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం..

● చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, సభ్యులు మార్కెట్ కార్యలయంలో బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

- చొప్పదండి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుమ్లాపూర్ క్రాస్ రోడ్ వద్ద చైర్ పర్సన్ గుర్రం నీరజ మొక్కలను నాటారు

● హుజూరాబాద్: పట్టణంలోని విజ్ఞాన వికాస కేంద్రంలో మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు.

● హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● గంగాధర: స్వయం ఉపాధి పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దమ్మని రాము అన్నారు. బుధవారం తిమ్మాపూర్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణసంస్థ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అగర్‌బత్తీల తయారీపై గంగాధరలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ శిక్షణ కాలంలో ఉచిత భోజనం, కోర్సు మెటీరీయల్, యూనిఫాం అందించనున్నట్లు తెలిపారు.

- మండల స్థాయి పరిపాలనను బుధవారం ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా గంగాధరకు వచ్చిన ట్రైనీ కలెక్టర్‌ను ఎంపీడీవో రాము స్వాగతం పలికారు.

● రామడుగు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● ఇల్లందకుంట: కేంద్ర బడ్జెట్ రైతులను, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా మోసం చేసే విధంగా ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాము ఓ ప్రకటనలో విమర్శించారు.

● జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో పని చేసి బదిలీపై వెళుతున్న అధికారులు, సిబ్బందిని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ మహమ్మద్ అయాజ్ సన్మానించారు.

● జమ్మికుంట రూరల్: పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ అన్నారు. బుధవారం జమ్మికుంటలోని చాణక్య డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జమ్మికుంట అధ్యక్షుడు గరిగె చంద్రయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించి పీఆర్సీని జూలై 2023 నుంచి అమలు చేయాలన్నారు.

● శంకరపట్నం: ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన గోల్కొండ కృష్ణప్రసాద్‌ను బుధవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సన్మానించారు.

● హుజూరాబాద్ రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన గన్ను అన్నపూర్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను మున్నూరు కాపు సంఘం సభ్యులు బుధవారం పరామర్శించారు. వారికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.